COMMUNIST PARTY OF INDIA (MARXIST)
Telangana State Committee
M.B.Bhavan, H. No.1-1-60/2, RTC 'X' Roads, Hyderabad -20.
Ph. 040- 27665011 /12, Fax : 27665013, Email-cpimtelangana@gmail.com

ప్రచురణార్థం/ప్రసారార్థం : తేది: 11.04.2020

# మార్క్స్ సమకాలికుడు పూలే

## కుల అసమానతలపై పోరాడాలి

## జయంతి సభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

మహాత్మా జోతిబా పూలే గొప్ప సంఘ సంస్కర్త అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఆయన మార్క్స్ సమకాలికుడని అభిప్రాయపడ్డారు. జోతిబా పూలే జయంతి సభ శనివారం హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో జరిగింది. పూలే చిత్రపటానికి తమ్మినేని వీరభద్రం పూలమాల వేసి నివాళులర్పించారు. జోహార్ పూలే, సాధిద్దాం పూలే ఆశయాలను అని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ 18వ శతాబ్దంలోనే సంఘ సంస్కరణల కోసం, కుల అసమానతలకు వ్యతిరేకంగా, సాంఘిక సమానత్వం సాధించడానికి జీవితాంతం పోరాడిన మహాయోధుడు పూలే అని ఆయన సేవలను కొనియాడారు. కుల వ్యత్యాసాల కోసమే కాకుండా ఆర్థిక వ్యత్యాసాలు పోవాలని కృషి చేశారని గుర్తు చేశారు. అంబేద్కర్ దళితుల అంటరానితనానికి వ్యతిరేకంగా జీవితాంతం పోరాడారని అన్నారు. జోతిబా పూలే స్త్రీ సంస్కరణలు, ధనిక, పేద తారతమ్యాలు రూపుమాపేందుకు పనిచేశారని చెప్పారు.

200 సంవత్సరాల క్రితమే కుల అసమానతలపై పోరాడ్డం సామాన్యమైన విషయం కాదన్నారు. కుల వ్యత్యాసాలను ధర్మంగా పాటిస్తున్న సమయంలో దానికి వ్యతిరేకంగా పోరాడ్డానికి ఎంతో ధైర్యం కావాలని చెప్పారు. పూలే ధైర్యంగా దూరదృష్టితో ఆనాడే కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడారని గుర్తు చేశారు. 1848లో మార్క్స్, ఏంగెల్స్ కమ్యూనిస్టు ప్రణాళిక రచించారని చెప్పారు. అదే సంవత్సరంలో జోతిబా పూలే ఆయన సతీమణి సావిత్రిబాయి పూలే మహిళా విద్య కోసం పాఠశాలలు ప్రారంభించారని వివరించారు. బాల్య వివాహాలు చేసుకుని వేల మంది వితంతువులుగా మారిన వారికి పునర్జీవితం కల్పించారనీ, వారికి తిరిగి పెండ్లిండ్లు చేశారనీ అన్నారు. సమాజంపై తిరుగుబాటు చేసిన మహాసంఘ సంస్కర్త అని చెప్పారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు ఎంతో మంది సంఘసంస్కర్తలు పనిచేసినా ఈ దేశంలో లోతుగా వేళ్లూనుకున్న కుల వ్యవస్థ బలంగా ఇప్పటికీ కొనసాగుతున్నదని వివరించారు. నాడు ఫ్యూడల్ వ్యవస్థలో ఇప్పుడు పెట్టుబడిదారీ వ్యవస్థలోనూ కుల వ్యవస్థను ఉన్నదని చెప్పారు. దోపిడీ, రాజకీయాలు,పెట్టుబడి సమీకరణ, ఆర్థిక వ్యత్యాసాలు కొనసాగించడానికి కులాన్ని వాడుకుంటున్నదని అన్నారు.

దేశ విముక్తి, సామాజిక విముక్తిలో ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా చేసే పోరాటంతోపాటు కుల, సాంఘిక అసమానతలకు వ్యతిరేకంగా అంతే స్థాయిలో పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. జోతిబా పూలే ఆశయాలను ముందుకు తీసుకుపోవాలన్నారు. ఇదే ఆ మహనీయుడికి అర్పించే నివాళి అవుతుందని చెప్పారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి వెంకట్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు జి నాగయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి రాములు, టి జ్యోతి, జాన్‌వెస్లీ, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్ శ్రీరాంనాయక్, పి ఆశయ్య, టి స్కైలాబ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

(జె.బాబూరావు)
ఆఫీసు కార్యదర్శి